

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



వాతావరణానికి అనుగుణంగా సాగు

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణా సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. 10లో



జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలిక పాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

ప్రధానిని కలిసిన ఎంపీ రంగయ్య



ప్రధాని మోదీతో ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం క్రైం: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ముగింపు సందర్భంగా శుక్రవారం లోక్‌సభ స్పీకర్ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, లోకసభ స్పీకర్ ఓంబిర్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానిని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప తదితరులు ఉన్నారు.

11 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో గత మూడు రోజులుగా అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 11 మండలాల పరిధిలో 4.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. యల్లనూరులో 41.6 మి.మీ, శింగనమల 35.2, బుక్కరాయసముద్రం 15, పుట్లూరు 12.6 మి.మీతో పాటు నార్పల, కణేకల్లు, గార్లదిన్నె, అనంతపురం, గుత్తి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు తదితర మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 83.8 మి.మీ కాగా ప్రస్తుతానికి 8.8 మి.మీ నమోదైంది. జిల్లాలో అక్కడక్కడా కురుస్తున్న తేలికపాటి వర్షాలు ఖరీఫ్ పంటలకు కొంత వరకు ఊరటనిస్తున్నాయి. కాగా రాగల రెండు రోజులూ జిల్లాకు తేలికపాటి వర్ష సూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

ఏడు నామినేషన్ల తిరస్కరణ



అనంతపురం రూరల్: పంచాయతీ ఉప ఎన్నికలకు దాఖలైన నామినేషన్లలో ఏడింటిని అధికారులు తిరస్కరించారు. వివిధ కారణాలతో జిల్లాలో ఖాళీ ఏర్పడిన సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు దాఖలైన నామినేషన్లను శుక్రవారం స్క్రూట్నీ చేశారు. పెద్దపప్పూరు మండలం దేవుని ఉప్పలపాడు సర్పంచ్ స్థానానికి దాఖలైన రెండు నామినేషన్లలో ఒక నామినేషన్‌తో పాటు వార్డు స్థానాలకు సంబంధించి ఆరు నామినేషన్లు సరిగా లేకపోవడంతో తిరస్కరించినట్లు డీపీఓ ప్రభాకర్‌రావు తెలిపారు. నామినేషన్లు తిరస్కరణకు గురైన అభ్యర్థులు శనివారం అప్పీల్‌కు వెళ్లవచ్చని పేర్కొన్నారు.

నాణ్యమైన వైద్యమందించాలి



వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

రాయదుర్గం టౌన్: ప్రభుత్వాస్పత్రుల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని కేంద్రం నుంచి వచ్చిన ఎంఎస్‌ఏ బృందం సభ్యులు పునితా బవాటియా, సుమన్‌దేవ్ తెలిపారు. 'ముస్కాన్ నేషనల్ అసెసర్స్' కార్యక్రమంలో భాగంగా ఇద్దరు వైద్యులతో కూడిన బృందం శుక్రవారం రాయదుర్గం కమ్యూనిటీ ఆస్పత్రిని సందర్శించింది. ఆస్పత్రిలో ప్రసవాలు, తల్లీబిడ్డలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసింది. సుఖప్రసవాలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 'ముస్కాన్' లక్ష్యాలకనుగుణంగా అమలవుతోందా లేదా అని తెలుసుకునేందుకు బృందం సభ్యులు వచ్చారని ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి తెలిపారు.

ఓటరు జాబితా సవరణకు నేడు, రేపు స్పెషల్ డ్రైవ్

అనంతపురం అర్బన్: ఓటరు జాబితా సవరణలో భాగంగా శని, ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. డ్రైవ్‌లో ఇంటింటికీ వెళ్లి ఓటరు పరిశీలన పక్కాగా చేపట్టాలన్నారు. ఓటరు జాబితా సవరణపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేక డ్రైవ్‌లో కొత్త ఓటరు నమోదు చేయాలన్నారు. ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1950కి ఫోన్ చేయాలన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించండి

- మహిళలకు కలెక్టర్ గౌతమి పిలుపు
- వైఎస్సార్ సున్నా వడ్డీ సొమ్ము జమ
- జిల్లాలో 4.57 లక్షల మంది మహిళల ఖాతాల్లోకి రూ.61.59 కోట్లు



మెగాచెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తదితరులు

అనంతపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అక్కచెల్లెమ్మలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ గౌతమి ఆకాంక్షించారు. వరుసగా నాలుగో ఏడాదీ 'వైఎస్సార్ సున్నా వడ్డీ' పథకం నగదు జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలాపురంలో శుక్రవారం కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. అనంతపురం కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి కలెక్టర్ తదితర జిల్లా అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద జిల్లాలో అర్హత కలిగిన 42,186 స్వయం సహాయక సంఘాల్లోని 4,57,493 మంది అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాలకు రూ.61,59,85,000 జమ చేసినట్లు తెలిపారు. ఇందులో పట్టణ ప్రాంతాల్లో 10,318 స్వయం సహాయక సంఘాలకు రూ.18.64 కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని 31,868 సంఘాలకు రూ.42.95 కోట్ల సొమ్ము విడుదలైందన్నారు. ఆర్థిక సాయాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వడ్డీ లేని రుణాలు అందించడం వల్ల మహిళలు సొంతకాళ్లపై నిలబడి కుటుంబాలను పోషించుకునేందుకు ఆదాయ మార్గాలు పొందుతారని పేర్కొన్నారు. రుణాలను జాగ్రత్తగా ఉపయోగించుకుని మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా రూ.61.59 కోట్ల మెగా చెక్‌ను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



ఆర్థిక అవసరాలకు అప్పులు చేయాల్సిన పని లేకుండాపోయింది. ప్రతి నెలా సక్రమంగా అప్పు, వడ్డీ కలిపి తిరిగి చెల్లించడంతో నాకు 'వైఎస్సార్ సున్నా వడ్డీ' పథకం కింద లబ్ధి కలిగింది. మా సంఘానికి రూ.15 లక్షలు రాగా.. అందులో నేను రూ.1.50 లక్షల రుణం తీసుకున్నాను. టైలరింగ్ చేస్తూ కుటుంబ పోషణకు అవసరమైన ఆదాయం సంపాదిస్తున్నాను. మహిళలను సీఎం జగన్ ఎంతగానో ఆదుకుంటున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– శారద, శ్రీ వెంకటేశ్వర మహిళా సంఘం, రాజీవ్‌కాలనీ, అనంతపురం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



సంఘం తరఫున రూ.15 లక్షల రుణం తీసుకున్నాం. ఆ డబ్బుతో సెంట్రింగ్ సామాన్లు పెట్టుకుని బాడుగకు ఇచ్చుకుంటూ కుటుంబ పోషణ చేసుకుంటున్నాను. నెలకు రూ.15 వేల ఆదాయం వస్తోంది. మా అమ్మాయికి 'అమ్మ ఒడి' పథకం వర్తించింది. మహిళా సంఘాల సభ్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండగా ఉంటున్నారు. చాలా సంతోషంగా ఉంది. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇన్ని పథకాల ద్వారా మాకు లబ్ధి చేకూర్చలేదు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నా.

– కామాక్షమ్మ, తెలుగుతల్లి మహిళా సంఘం, రాప్తాడు

తాడిపత్రిలో చిన్నారి కిడ్నాప్

- గంటల వ్యవధిలోనే ఛేదించిన పోలీసులు




చిన్నారి జ్యోతి, కిడ్నాపర్ మంజుల (ఫైల్)

తాడిపత్రి: అభం శుభం తెలియని చిన్నారిని ఓ మహిళ కిడ్నాప్ చేసింది. తల్లిదండ్రుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు గంటల వ్యవధిలోనే కిడ్నాపర్‌ను గుర్తించి.. చిన్నారిని రక్షించారు. వివరాలిలా ఉన్నాయి. తాడిపత్రి పట్టణంలోని బిందెల కాలనీలో పరుశురాముడు, మారెక్క దంపతులు నివసిస్తున్నారు. వీరికి నలుగురు కుమార్తెలు. పరుశురాముడు ప్లాస్టిక్ సామాన్లు విక్రయిస్తుండగా, మారెక్క యాచన చేస్తుండేది. పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో నివాసముంటున్న పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటకు చెందిన వితంతువు మంజులకు మారెక్కతో పరిచయం ఉంది. పిల్లలను పోషించుకోవడం మీకు భారం కదా.. ఒక అమ్మాయిని తనకు ఇస్తే పెంచుకుంటానని మారెక్కను పలుమార్లు అడిగింది. అందుకు ఆమె ఒప్పుకోలేదు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం మారెక్క ఇంట్లో స్నానం చేస్తుండగా.. నాలుగో కుమార్తె అయిన పద్దెనిమిది నెలల జ్యోతిని మంజుల ఎత్తుకెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్తతో చిన్న కుమార్తె కనిపించడం లేదని మారెక్క తెలిపింది. వెంటనే దంపతులిద్దరూ పట్టణ సీఐ హమీద్‌ఖాన్‌ను ఆశ్రయించారు. ఆయన వెంటనే పోలీసు సిబ్బందిని రంగంలోకి దింపారు. గుంతకల్లులో కిడ్నాపర్ ఉన్నట్లు సమాచారం తెలుసుకుని.. ఇక్కడి ఎస్ఐని అక్కడకు పంపించారు. మంజులను గుర్తించి, ఆమెవద్దనున్న చిన్నారి జ్యోతిని తాడిపత్రికి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. మంజులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతకు పట్టం

- వచ్చే ఎన్నికలకు 60 వేల మందికి పైగా కొత్త ఓటర్లు
- తీవ్ర ప్రభావం చూపించనున్న యువ ఓటర్లు
- ఓటర్ల సవరణపై యంత్రాంగం ముమ్మర కసరత్తు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో యువ ఓటర్ల సంఖ్య భారీగా పెరగనుంది. 2019 ఎన్నికల నాటికి 14 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ 2024లో జరిగే ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హత సాధిస్తారు. పెరగనున్న యువ ఓటర్లే నిర్ణాయక శక్తిగా ఉంటారని నిపుణులు భావిస్తున్నారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 60 వేల నుంచి లక్ష మంది వరకు కొత్త ఓటర్లు 2024లో ఓట్లు వేయనున్నట్టు అంచనా. 22 లక్షల జనాభా ఉన్న జిల్లాలో లక్ష మందికి కొత్తగా ఓటు హక్కు రానున్నట్టు తెలుస్తోంది.

ఓటర్ల సవరణలో ముమ్మర కసరత్తు

ఓటర్ల సవరణపై రెవెన్యూ యంత్రాంగం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఒకే చిరునామాపై పలువురు ఓటర్లు నమోదు అయి ఉండటం, కొన్ని డూప్లికేట్ అయి ఉండటం గుర్తించి వాటిని తొలగిస్తున్నారు. దీనికోసం శని, ఆదివారాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. బీఎల్‌ఓలతో పాటు పలువురు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేస్తున్నారు. కొంతమంది ఓటు హక్కు ఉండి కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉన్నారు. పదేళ్లు దాటిన తర్వాత కూడా వారి ఓటు హక్కు ఇక్కడే ఉంది. అలాంటి ఓట్లన్నీ తొలగిస్తున్నారు. 2019 ఎన్నికల నాటికి 19,08,182 ఓట్లు ఉన్నాయి.



ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం

మరికొద్ది నెలల్లో సాధారణ ఎన్నికలు జరపనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కొత్త ఓటర్ల నమోదుపై విస్తృతప్రచారం కల్పించనుంది. 18 ఏళ్లు నిండి జిల్లాలో చిరునామా కలిగి ఉన్న వాళ్లకు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వెసులుబాటునూ ఇచ్చారు. అనంతరం వెరిఫికేషన్‌లో ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఇకపై నకిలీ ఓటర్లు, డూప్లికేట్, డబల్ ఓటింగ్ లాంటివి లేకుండా పక్కాగా జాబితా తయారు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 19.39 లక్షల మంది ఓటర్లు ఉన్నారు.

పక్కాగా ఓటరు జాబితా తయారీ

జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అవకాశం కల్పిస్తాం. అర్హులు ఓటరుగా నమోదు కావాలి. అలాగే ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. అనర్హుల ఓట్లు తొలగించి జాబితాపే పక్కాగా తయారు చేస్తున్నాం.

–కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

2023 జనవరి 5 నాటికి ఓటర్లు

నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య
రాయదుర్గం	2,54,661
ఉరవకొండ	2,15,481
గుంతకల్లు	2,60,353
తాడిపత్రి	2,39,216
శింగనమల	2,39,349
అనంతపురం అర్బన్	2,62,456
రాప్తాడు	2,45,413

తాజాగా ఓటర్ల సవరణ ఇలా..

డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించినవి	730
మృతి చెందిన ఓటర్ల సంఖ్య	1,992
శాశ్వతంగా చిరునామా మార్చినవారు	1,131
హౌస్ నంబర్లు తప్పుగా ఉన్నవి	9,390
ఒకే చిరునామాపై ఎక్కువ ఓటర్లు	8,634
వందేళ్లు దాటిన ఓటర్లు	254

2019 ఎన్నికల నాటికి ఓటర్లు ఇలా..

మొత్తం ఓటర్లు	19,08,182
పురుషులు	9,55,049
మహిళలు	9,52,940
ట్రాన్స్‌జెండర్స్	193

త్యాగాల ఫలితమే స్వాతంత్య్రం

- సమరయోధుల త్యాగాలు మరువలేనివి
- భారతీయ సంస్కృతిని కాపాడాలి
- పీఆర్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ సూర్యకుమారి



హవల్దార్ మల్లికార్జునరెడ్డి కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న కమిషనర్ సూర్యకుమారి, కలెక్టర్ గౌతమి

రాప్తాడు: ఎందరో మహనీయుల త్యాగఫలితంతోనే స్వాతంత్య్రం సిద్ధించిందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'నా భూమి–నా దేశం' నినాదంతో ప్రసన్నాయపల్లిలోని వినయ్‌కుమార్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 'నేల తల్లికి నమస్కారం– వీరులకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కమిషనర్ సూర్యకుమారి, కలెక్టర్ గౌతమి 'నా భూమి–నా దేశం' శిలాఫలకం ఆవిష్కరించారు. అలాగే రెయిన్ వాటర్ రూఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ (వర్షపు నీటి పైకప్పు హార్వెస్టింగ్ నిర్మాణం) ప్రారంభించి, 'వసుధకు వందనం' కింద మొక్కలు నాటారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మాట్లాడుతూ 'నా భూమి – నా దేశం' శిలా ఫలకాన్ని విద్యార్థులు ప్రతి రోజూ చూడాలని, దాంతో వారు నిత్యం ఏం చేయాలో అవగతమవుతుందని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిని విద్యార్థులు కాపాడాలన్నారు. విద్యార్థులు ప్లాస్టిక్ బాటిల్స్ ఉపయోగించరాదని, మొక్కలు పెంచాలని, పెద్దలను గౌరవించాలన్నారు. తోటి వారికి సహాయ పడాలని, చెట్లు నరకరాదని, నీరు జాగ్రత్తగా ఉపయోగించాలని, జంక్ ఫుడ్ తినరాదని సూచించారు. బాగా చదువుకొని ప్రయోజకులు కావాలన్నారు. విదేశాల్లో చదివినా పుట్టిన భూమికి సేవ చేసేందుకు ముందుకు రావాలన్నారు. వినయ్‌కుమార్ స్కూల్లో చదివిన చాలామంది ఆర్మీ జవాన్లుగా పని చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ 'వసుధకు వందనం' లో భాగంగా ప్రతి పంచాయతీలో 75కు పైగా మొక్కలు నాటుతున్నామన్నారు. 'నా భూమి– నాదేశం' కార్యక్రమంలో పౌరులు పాలుపంచుకుని దేశం పట్ల గౌరవం, దేశభక్తిని చాటి చెప్పాలన్నారు. ప్రసన్నాయపల్లికి చెందిన మల్లికార్జునరెడ్డి ఆర్మీలో హవల్దార్‌గా చేరి కార్గిల్ యుద్ధంలో గాయపడి 1999 ఆగస్టు 16న మృతి చెందడంతో ఆయన తల్లి ఈశ్వరమ్మ, భార్య మల్లేశ్వరి, కుమారుడు విద్యాసాగర్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఇదే గ్రామం నుంచి ఆర్మీ జవాన్లుగా పని చేసి రిటైర్డ్ అయిన సుంకిరెడ్డి, మధుసూదన్‌రావు, వెంకటేశులునాయక్, రాజారెడ్డి, భాస్కర్, నల్లపరెడ్డి, సురేష్, మదార్ సాహెబ్, సూర్యనారాయణ, మధుసూదన్ తదితర జవాన్లు, వారి కుటుంబ సభ్యులకు మెమొంటోలు అందించి, శాలువా కప్పి సత్కరించారు. అనంతరం హంపాపురం సమీపంలోని 39 అడుగుల అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ వాటర్ షెడ్ కింద చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. రైతలతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం జాయింట్ కమిషనర్ శివప్రసాద్, హార్టికల్చర్ జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్, హార్టికల్చర్ డిప్యూటీ కమిషనర్ భవాని, ఆర్డీఓ మధుసూదన్, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్ రెడ్డి, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, డీపీఓ విజయ్ కుమార్, డిప్యూటీ సీఈఓ శ్రీనివాసులు, డ్వామా ఏపీడీ అయేషా, ఈజీఎస్ సూపరింటెండెంట్ శైలజ, ప్లాంటేషన్ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉంతకల్లు వద్ద హెచ్చెల్సీకి పైపింగ్

- పూడ్చివేతకు యుద్ధప్రాతిపదికన చర్యలు



పైపింగ్‌ను పరిశీలిస్తున్న హెచ్చెల్సీ అధికారులు

బొమ్మనహాళ్: ఉంతకల్లు సమీపంలోని 113–557వ కిలోమీటరు వద్ద తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు శుక్రవారం తెల్లవారుజామున పైపింగ్ పడింది. హెచ్చెల్సీ ప్రధాన కాలువను పర్యవేక్షిస్తున్న సిబ్బంది చిన్నపాటి రంధ్రాలు ఏర్పడి బయటకెళ్తున్న నీటిని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కణేకల్లు హెచ్చెల్సీ డీఈఈ మద్దిలేటి ఆధ్వర్యంలో బొమ్మనహాళ్, కణేకల్లు జేఈఈలు గోపాల్‌నాయక్, అల్తాఫ్ సంఘటనా స్థలానికి చేరుకొని పైపింగ్‌ను పరిశీలించారు. ప్రస్తుతం సరిహద్దులో హెచ్చెల్సీకి 1,800 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా.. అందులో 400 క్యూసెక్కులు తగ్గిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటిని వదిలి ఏడు రోజులు కాకముందే ఉంతకల్లు వద్ద రంధ్రాలు పడ్డాయన్నారు. తాత్కాలికంగా మట్టిబస్తాలు వేసి రంధ్రం పూడ్చే పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టామన్నారు. అనంతరం జేసీబీ సహాయంతో గట్టును తవ్వి రంధ్రం గుర్తించి మళ్లీ పటిష్టీకరిస్తామన్నారు. ఎలుకలు ఏర్పాటు చేసిన రంధ్రాల ద్వారా నీరు బయటికి వచ్చి పైపింగ్‌గా మారుతున్నాయన్నారు. కాలువ గట్లపై లస్కర్లు ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు తెలిపారు.




హెచ్చెల్సీ వద్ద జేసీబీ ద్వారా మట్టితో రంధ్రాన్ని పూడ్చి వేస్తున్న దృశ్యం

కాలవా.. పూడ్చివేత పనులు కన్పించవా?

అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్న హెచ్చెల్సీ పైపింగ్ పూడ్చివేత పనులు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులుకు కనిపించడం లేదా అని వైఎస్సార్ సీపీ నాయకులు, ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. విషయం తెలియగానే హెచ్చెల్సీ అధికారులు శుక్రవారం ఉదయం నుంచి పైపింగ్ పూడ్చివేసే పనిలో నిమగ్నమై ఉన్నారని స్పష్టం చేశారు. అయితే కాలవ శ్రీనివాసులు దీన్ని రాజకీయం చేయడానికి దుష్ప్రచారం చేయడం తగదని హితవు పలికారు.

వరి వద్దు.. చిరుధాన్యాలు మేలు




అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు గతేడాదికన్నా తక్కువగా ఉన్నందున హెచ్చెల్సీ, హంద్రీ–నీవా ఆయకట్టు కింద వరి సాగు ఆమోదయోగ్యం కాదని, తక్కువ నీటితో పండే రాగి, కొర్ర, జొన్న వంటి చిరుధాన్యాల సాగు మేలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కరువు సంక్షోభ నివారణ అంశంపై జేడీఏ ఉమామహేశ్వరమ్మతో కలిసి వ్యవసాయ, దాని అనుబంధ, నీటిపారుదల శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయన్నారు. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో లోటు వర్షపాతం నమోదయ్యిందన్నారు. ఇందుకు అనుగుణంగా అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ కరువు నివారణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. పండించిన రాగులు, జొన్నలను పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండడంతో లాభదాయంగా ఉంటుందనే విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, నీటిపారుదల, ప్రజారోగ్య శాఖల అధికారులు, ఏఆర్ఎస్, కేవీకే శాస్త్రవేత్తలు తమ ప్రణాళికలను తెలియజేశారు.

టమాట ధర.. దిగొచ్చెనంట!

- కిలో గరిష్ట ధర రూ.50
- సామాన్య ప్రజలకు భారీ ఊరట



అనంతపురం అగ్రికల్చర్: టమాట ధరలు తగ్గుముఖం పట్టాయి. సాధారణ స్థాయికి చేరుకోవడంతో వినియోగదారులకు ఊరట లభించింది. మార్కెట్‌కు పెద్ద ఎత్తున సరుకు వస్తుండటంతో ధరలకు క్లైం పడుతోంది. 20 రోజులుగా నింగినంటిన టమాట ధర చరిత్ర సృష్టించింది. ఓ దశలో కిలో రూ.160 పలకడంతో రైతు ఇంట పంట పండించిన టమాట ఇపుడు సాధారణ స్థాయికి చేరువవుతోంది. అన్నమయ్య జిల్లా మదనపల్లి, కర్ణాటకలోని కోలార్ తర్వాత పెద్దమార్కెట్‌గా 'అనంత' ఉంది. ఉమ్మడి జిల్లాతో పాటు పక్కనున్న కర్ణాటక ప్రాంతం నుంచి రైతులు మార్కెట్‌ను ఆశ్రయిస్తున్నారు. గడిచిన నెల రోజుల్లో చాలామంది రైతులు నష్టాల నుంచి ఆర్థికంగా గట్టెక్కారు. ఈ నెలంతా గరిష్ట ధరలు పలికే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. కానీ... సరుకు పెరగడంతో ధరలు తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. కాగా శుక్రవారం కక్కలపల్లి మండీలో కిలో టమాట గరిష్ట ధర రూ.50 పలికింది. మార్కెట్‌కు 2,550 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చాయి. కనిష్ట ధర రూ.26, సరాసరి రూ.35 పలికాయి.

క్లుప్తంగా

రెండు రోజుల్లో హంద్రీనీవాకు నీరు విడుదల



ఉరవకొండ: రాబోవు రెండు, మూడు రోజుల్లోగా హంద్రీ–నీవా సుజల స్రవంతి కెనాల్‌కు నీటిని విడుదల చేస్తారని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హంద్రీనీవా కాలువకు నీటి విడుదల జాప్యం జరగడంతో రైతులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని, రైతులు నీళ్ల కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పంపింగ్ చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను కోరామన్నారు. దీనికి స్పందనించిన అధికారులు రెండు మూడు రోజుల్లో హంద్రీనీవాకు నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈయేడాది నీటి లభ్యత తక్కువగా ఉన్నా రైతు సంక్షేమం దృష్ట్యా నీటిని విడుదలయ్యేలా చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌తో పాటు అధికారులకు ఎమ్మెల్సీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల కోసం ముందస్తుగా హంద్రీనీవాకు నీటిని విడుదల చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీకు రైతులు ధన్యవాదాలు తెలిపారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయం



అనంతపురం సిటీ: తపాలా శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను విక్రయించనున్నట్లు ఆ శాఖ పీఆర్‌ఓ ప్రమోద్ శుక్రవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం విజయవంతం కోసం 30 x 20 నిడివి ఉన్న జాతీయ జెండాను ప్రత్యేకంగా రూపొందించినట్లు వివరించారు. ప్రజల్లో జాతీయ భావాన్ని, దేశ భక్తిని పెంపొందించే క్రమంలో ఒక్కో జెండా కేవలం రూ.25 కే విక్రయించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని హెడ్, సబ్, బ్రాంచ్ పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చావుబతుకుల మధ్య అనిత

- కానిస్టేబుల్ భార్య ఆపరేషన్‌కు రూ.10 లక్షలు అవసరమన్న వైద్యులు
- దాతల సాయం కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్/ఆత్మకూరు: రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన కానిస్టేబుల్ సతీమణి అనిత ఆరోగ్య పరిస్థితి విషమిస్తున్నట్లు బెంగళూరు వైద్యులు తెలిపారు. ఆమెకు ఆపరేషన్ చేస్తే కోలుకునే అవకాశం ఉందని, రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. ఇంటి పెద్ద కిరణ్ చనిపోవడంతో వారి పిల్లలు చిన్నారులు కావడంతో చేతిలో డబ్బులు లేక ఆ కుటుంబం చేయూత కోసం ఎదురుచూస్తోంది.

రూ.3 లక్షలు సాయం చేసిన ఎస్పీ

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ కుటుంబానికి ఎస్పీ కంచి శ్రీనివాసరావు అండగా నిలిచారు. కానిస్టేబుల్ భార్య అనిత చికిత్స నిమిత్తం రూ.3 లక్షలు చెక్కును అనిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ప్రత్యేకంగా కానిస్టేబుల్‌ను నియమించి అనితకు వైద్యం సక్రమంగా అందేలా చర్యలు తీసుకున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకుంటున్నారు.

కరుణించిన ఖాకీలు

ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్ మృతిని పోలీసుశాఖ జీర్ణించుకోలేకపోయింది. చాలా మందితో సన్నిహితంగా మెలిగిన కిరణ్‌కుమార్ ప్రమాదంలో మృతిచెందడంతో కన్నీరు పెట్టుకోని ఖాకీలేడు. ఈ క్రమంలోనే అతని భార్య అనిత ఆరోగ్యం విషమంగా ఉన్న విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు చేయి చేయి కలిపి సాయం చేసేందుకు ముందుకు కదిలారు. ఇందులో భాగంగానే పీటీసీలో పనిచేస్తున్న డీఎస్పీ మల్లికార్జున వర్మ రూ.25 వేలు ఆర్థిక సహాయం చేశారు. కియా పోలీసు స్టేషన్ సిబ్బంది రూ.10 వేలు సహాయం చేశారు. ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా గంటల వ్యవధిలోనే రూ.2.50 లక్షలను పంపి బాధిత కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.





చికిత్స పొందుతున్న అనిత, కుటుంబ సభ్యులకు రూ.3 లక్షల చెక్కు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

సాయం చేయదలచిన వారు కింద తెలిపిన ఖాతాలకు డబ్బు పంపవచ్చు

ఎస్.శ్రీనివాసులు,
కానిస్టేబుల్ (ఏఆర్ 3889)
బ్యాంక్ ఖాతా నంబర్
10873522688
ఐఎఫ్ఎస్‌సీ కోడ్
ఎస్‌బీఐఎన్ 0016493
ఫోన్‌పే నంబర్
9494291891

జి.నాగరాజు
కానిస్టేబుల్ (పీసీ1671)
బ్యాంక్ ఖాతా నంబర్
31608242623
ఐఎఫ్ఎస్‌సీ కోడ్
ఎస్‌బీఐఎన్ 0000806
ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్
9949821343

'అనంత'లో క్రికెటర్ల సందడి



రాయలసీమ కింగ్స్ జట్టు సభ్యులతో భారత క్రికెటర్ హనుమ విహారి తదితరులు

అనంతపురం: ఏపీఎల్–2 టోర్నీ నిర్వహిస్తున్న నేపథ్యంలో రాయలసీమ కింగ్స్ జట్టు సభ్యులు అనంతపురంలో సందడి చేశారు. భారత క్రికెటర్, రాయలసీమ కింగ్స్ జట్టు కెప్టెన్ హనుమ విహారి రాకతో యువత కేరింతలు కొట్టింది. ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రాయలసీమ కింగ్స్ జట్టు లోగో, థీమ్‌ను విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమ విహారి, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి , రాయలసీమ కింగ్స్ జట్టు సీఈఓ బి. నాగభూషణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమ విహారి మాట్లాడుతూ... అనంతపురం రావడం చాలా ఆనందంగా ఉందని, ఆర్డీటీ స్టేడియంలో ప్రాక్టీస్ సెషన్స్ నిర్వహిస్తున్నామని, ఈ దఫా రాయలసీమ జట్టు ఏపీఎల్ ట్రోఫీని కచ్చితంగా సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రికెట్‌లో రాణించాలంటే డబ్బు ప్రధానం కాదన్నారు. ఒక మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వాడినని, కష్టపడితే ఏదైనా సాధించవచ్చునన్నారు. తమ జట్టు సభ్యులందరూ ప్రతిభ గల ఆటగాళ్లేనన్నారు. గెలుపుకోసం శక్తివంచన లేకుండా కృషి చేయాన్నారు. రాయలసీమ కింగ్స్ జట్టు సీఈఓ నాగభూషణ రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే రాయలసీమ టీంను ఏర్పాటు చేశామన్నారు.



కార్యక్రమానికి వచ్చిన అభిమానులు

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

కళ్యాణదుర్గం: పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు చనిపోయాడు. పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని బోయవీధికి చెందిన రాజ్‌కుమార్ (34) సుమో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం వాల్మీకి సర్కిల్ నుంచి తన ద్విచక్ర వాహనంలో రాజ్‌కుమార్ ఇంటికి వెళ్తుండగా బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురంకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వడ్డే అమరేష్ ఎదురుగా వస్తున్న రాజ్‌కుమార్‌ను ఢీ కొట్టాడు. దీంతో రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ నాగమధు తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజ్‌కుమార్ అకాల మృతితో మృతుని తండ్రి, భార్య, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి భార్య మల్లిక, మూడేళ్ల ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నాగమధు, గుమిగూడిన ప్రజలు

విప్ పీఎస్‌గా తహసీల్దార్ నీలకంఠారెడ్డి

అనంతపురం అర్బన్: ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి వ్యక్తిగత కార్యదర్శిగా (పీఎస్) తహసీల్దార్ నీలకంఠారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో కలెక్టర్ ఎమ్.గౌతమి ఆయనను 9న రిలీవ్ చేశారు. ఆయన ఈనెల 10న విజయవాడలో విప్ పీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. పుట్టపర్తి జిల్లా నుంచి ఇటీవలనే బదిలీపై జిల్లాకు వచ్చిన ఆయన స్పందన విభాగం తహసీల్దార్‌గా ఉన్నారు. తాజాగా విప్ పీఎస్‌గా ప్రభుత్వం ఆయన్ను నియమించింది.

సమన్వయంతో పనిచేయండి

- పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి

అనంతపురం అర్బన్: 'ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడే పనులు చేపట్టాలి. అడిగిన వెంటనే పని కల్పించేందుకు సిద్ధంగా ఉండాలి. సోషల్ ఆడిట్‌లో బోగస్‌కు ఆస్కారం ఇవ్వకుండా అధికారులందరూ సమన్వయంతో బాధ్యతగా విధులు నిర్వర్తించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి.' అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అమలుపై కమిషనర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో కలెక్టర్ ఎమ్.గౌతమితో కలిసి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల ఏపీడీలు, ఏపీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్‌కార్డున్న వారికి 100 రోజులకుపైగా పనులు కల్పించాలని ఆదేశించారు. రైతులకు దిగుబడి పెంచేలా వాటర్ షెడ్, లైవ్లీ హుడ్, హార్టికల్చర్ ద్వారా కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ ఉపాధి పథకం కింద కేటాయించిన లక్ష్యాలను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఈజీఎస్ డైరెక్టర్ చిన్నతాతయ్య, జాయింట్ కమిషనర్ శివప్రసాద్, హార్టికల్చర్ జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ భవాని, డ్వామా పీడీలు వెణుగోపాల్ రెడ్డి, రామాంజనేయులు, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, డీపీఓ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్ కమిషనర్ సూర్యకుమారి, చిత్రంలో కలెక్టర్ గౌతమి

ఇకపై డిజిటల్ విధానంలోనే చెల్లింపులు

రాప్తాడురూరల్: పంచాయతీల్లో ఇకపై నగదు రహిత చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. ఈనెల 15 నుంచి రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రారంభమయ్యే నగదు రహిత లావాదేవీల (యూపీఐ, డిజిటల్ ఆధారిత) చెల్లింపులను శుక్రవారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలో ప్రారంభించారు. కమిషనర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు డిజిటల్ పేమెంట్స్ ద్వారా ఇంటి పన్నులు చెల్లించారు. డిజిటల్ చెల్లింపులతో పారదర్శకత ఉంటుందని కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు, డివిజనల్ పంచాయతీ అధికారి సుమన జయంతి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి ఓబులమ్మ, ఎంపీడీఓ వై. పుల్లయ్య, సర్పంచ్ గార్లదిన్నె క్రిష్టయ్య, ఉప సర్పంచ్ బండి రమేష్, కక్కలపల్లి మాజీ సర్పంచ్ కల్లుమడి శ్రీనివాసులు, కక్కలపల్లి వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గాండ్ల బయ్యప్ప పాల్గొన్నారు.

రైలు కిందపడి లారీడ్రైవర్ మృతి



మృతుడు షెక్షావలి

యాడికి: మండలంలోని పెద్దపేట గ్రామానికి చెందిన ఓ లారీడ్రైవర్ గురువారం రాత్రి కర్ణాటక రాష్ట్రంలోని గదగ్‌లో రైలు కిందపడి మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల మేరకు .. పెద్దపేటకు చెందిన షెక్షావలి (45) లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహించేవాడు. షెక్షావలి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అయితే గురువారం మధ్యాహ్నం షెక్షావలి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి రాయలచెరువులోని రైల్వేస్టేషన్‌లో టికెట్ తీసుకొని తిరుపతి నుంచి గదగ్ వెళ్లే ప్యాసింజర్ రైలు ఎక్కాడు. గదగ్ రైల్వేస్టేషన్‌లో దిగిన తర్వాత రైలు కింద పడటంతో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి జేబులో ఉన్న సమాచారంతో రైల్వే పోలీసులు శుక్రవారం ఉదయం యాడికి పోలీసులకు సమాచారం ఇచ్చారు. యాడికి పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న షెక్షావలి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు, వారి బంధువులు మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు గదగ్‌కు వెళ్లారు.

సెర్ప్ ఉద్యోగులకు తీపి కబురు

- 23 శాతం మేర వేతనాల పెంపు

అనంతపురం: పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏకంగా 23 శాతం మేర జీతం పెంపుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 4,569 మంది సెర్ప్ ఉద్యోగులు ఉన్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో 261 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. మండల సమాఖ్య కోఆర్డినేటర్లు, వారికి సహకారం అందించే ఉద్యోగులు, ఒకటో స్థాయి నుంచి ఐదో స్థాయి ఉద్యోగుల వరకు జీతాలు పెంచారు. వాస్తవానికి ప్రభుత్వ ఉద్యోగుల కంటే వీరి జీతాలు తక్కువగా ఉన్నాయి. ఉన్నత ఉద్యోగ అర్హత, అనుభవం ఉండడంతో 23 శాతం జీతాలు పెంపుదల చేయాలని నిర్ణయించినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. జీతాల పెంపుదల నేపథ్యంలో సెర్ప్ ఉద్యోగులు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య



మృతుడు సతీష్

డీ హీరేహాళ్ (రాయదుర్గం): డీ హీరేహాళ్ మండలంలోని లింగమనహళ్లిలో హరిజన సతీష్ (22) అనే డిగ్రీ చదివే విద్యార్థి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రంగడుయాదవ్ వివరాల మేరకు.. బళ్లారిలోని సరళాదేవి ప్రైవేటు కళాశాలలో సతీష్ బీఎస్సీ పూర్తిచేశాడు. అయితే ఫస్ట్ సెమిస్టర్‌లో రెండు సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడు. పెండింగ్ సబ్జెక్టులు పూర్తిచేసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తూ వచ్చాడు. దీంతో తండ్రి మల్లన్న చదువుకోవాలని శుక్రవారం ఘాటుగా మందలించాడు. క్షణికావేశంలో విద్యార్థి సతీష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

వాతావరణానికి అనుగుణంగా పంటల సాగు

బుక్కరాయసముద్రం: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ సంస్థ (హైదరాబాద్) డైరెక్టర్ డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు రైతులకు సూచించారు. శుక్రవారం రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానంలో నేషనల్ అకాడమీ ఆఫ్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (హైదరాబాద్), ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం (రేకులకుంట) సంయుక్తంగా 'సమగ్ర మెట్ట వ్యవసాయం– వాతావరణ సానుకూల యాజమాన్య పద్ధతులు'పై మూడు రోజుల పాటు రైతులకు శిక్షణ నిర్వహించారు. రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డైరెక్టర్ డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు తరచూ ఒకే పంటను సాగు చేయరాదన్నారు. ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులను బట్టి పంటలను సాగు చేయాలన్నారు. 'ఆత్మా' అధికారి మద్దిలేటి, పశు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్‌నాయక్, ఉద్యాన పరిశోధనా స్థానం అధికారి సుబ్రహ్మణ్యం, శాస్త్రవేత్తలు చంద్రమోహన్, అశోక్‌కుమార్, వెంకటరమణ, శ్రీనివాస్, శశికళ, యాస్మిన్, రామసుబ్బయ్య, కిషోర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

జంబ్లింగ్ విధానం.. లోపభూయిష్టం

- పరీక్ష కేంద్రాల్లో పర్యవేక్షణ లోపం
- 45 కేంద్రాలకు కుదించిన వైనం
- జేఎన్‌టీయూఏ పరిధిలో ఇదీ పరిస్థితి

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ కోర్సుల సెమిస్టర్ పరీక్షలు జంబ్లింగ్ విధానంలో నిర్వహిస్తున్నారు. 2015 నుంచి ఈ విధంగా అమలు చేస్తున్నప్పటికీ లోపాలు సరిదిద్దే దిశగా వర్సిటీ అధికారులు ప్రయత్నించడం లేదు. పరీక్ష కేంద్రాల్లో యథేచ్ఛగా మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారు. పరీక్ష ప్రారంభానికి ముందే విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి కేంద్రంలోకి పంపాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారు. వాస్తవానికి సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరగాలి. కానీ కొన్ని కళాశాలల్లో సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. తాడిపత్రిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాయడంతో 16 మంది విద్యార్థులపై చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి వెళ్లిన గంట తరువాత పట్టుబడ్డారు. ఈ విషయంలో తప్పు విద్యార్థులదైతే నెపం తమపై నెట్టారంటూ సీవీ రామన్ కళాశాల యాజమాన్యం అంటోంది. జంబ్లింగ్ విధానంలో ఒక కళాశాల విద్యార్థులను పూర్తిస్థాయిలో మరొక కళాశాలలోని పరీక్ష కేంద్రానికి కేటాయిస్తుండడంతో ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అలా కాకుండా ఒక కళాశాల విద్యార్థులను రెండు లేదా మూడు ఇంజినీరింగ్ కళాశాలల కేంద్రాలకు కేటాయిస్తే సమస్యలు రావన్న భావన వ్యక్తమవుతోంది.

పరీక్ష కేంద్రాల కుదింపు

జేఎన్‌టీయూఏ పరిధిలో మొత్తం 80 పరీక్ష కేంద్రాలు ఉండేవి. తాజాగా వీటిని 45కు కుదించారు. పైగా ఒక కళాశాల విద్యార్థులను మరో కాలేజీ పరీక్ష కేంద్రానికి పూర్తిస్థాయిలో కేటాయిస్తున్నారు. దీనివల్ల పరస్పర అవగాహనకు వచ్చి మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహించడం లేదా కాలేజీల మధ్య వైరం ఉంటే విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం పరిపాటిగా మారింది. ఎక్కడైనా ఒకే పరీక్ష కేంద్రం అందుబాటులో ఉన్న పరిస్థితుల్లో ఆ విద్యార్థులను జేఎన్‌టీయూ అనంతపురం కేంద్రంలో పరీక్షలు రాయించాలి. ఎస్కేయూలో ఇదే విధానం అమలు చేస్తున్నారు. విజయనగర లా కళాశాల ఒకటే ఉండడంతో నేరుగా ఎస్కేయూ క్యాంపస్‌లో పరీక్షలు రాయిస్తున్నారు. ఇలాంటి విధానం జేఎన్‌టీయూఏలోనూ అమలు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. కాగా, పరీక్షల్లో లోపాలపై జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ జింకా రంగజనార్దనను సంప్రదించగా.. ప్రస్తుత జంబ్లింగ్ విధానం తీరుతెన్నులను పరిశీలించి మరింత పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పారు. తాడిపత్రి వ్యవహారంలో ఏ కళాశాల ప్రోద్బలమూ లేదని, సంబంధిత విద్యార్థులదే పూర్తి బాధ్యత అని అన్నారు.

అమ్మకు ధైర్యం చెప్పి.. కుమారుడి ఆత్మహత్య

- కామారుపల్లిలో విషాదం



జీవన్‌రెడ్డి (ఫైల్)

రాప్తాడురూరల్: నలతగా ఉన్న తల్లికి రాత్రి మాత్ర ఇచ్చాడు. తగ్గిపోతుంది లేమ్మా అంటూ ధైర్యం నింపాడు. అయితే తెల్లవారక ముందే ఆ బిడ్డ ఉరితాడుకు వేలాడుతూ కనిపించడంతో ఆ కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి. అనంతపురం రూరల్ మండలం కామారుపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... వెన్నపూస చంద్రశేఖర్‌రెడ్డి, ప్రమీల దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు వెన్నపూస జీవన్‌రెడ్డి (27) సంతానం. కూతుళ్లిద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. జీవన్‌రెడ్డి మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. కొంతకాలంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా వర్క్‌ఫ్రం హోం చేస్తున్నాడు. సదరు కంపెనీ నుంచి జీతాలు సరిగా రావడం లేదు. ఈ యువకుడు చదువుకున్న కోర్సుకు తగ్గ ఉద్యోగం కోసం ఎంత ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. ఏం జరిగిందో ఏమో తెలీదు కాని...గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఒంటిలో ఇబ్బందిగా ఉందని చెప్పిన తల్లికి మాత్ర ఇచ్చాడు. 11 గంటల సమయంలో గేటు వేశాడు. తల్లిదండ్రులు ఒక బెడ్ రూంలో, జీవన్‌రెడ్డి మరో బెడ్‌రూంలో నిద్రపోయారు. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో నిద్రలేచిన తల్లిదండ్రులు కొడుకుని పిలిచాడు. తలుపును ఎన్నిసార్లు కొట్టినా స్పందన లేదు. అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా కొడుకు ఉరికి వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. పోలీసులకు సమాచారం చేరవేయడంతో వచ్చి పరిశీలించారు. ఒక్కగానొక్క కుమారుడు ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, సర్పంచ్ మూలింటి లక్ష్మీకళ, లోకనాథరెడ్డి తదితరులు కామారుపల్లికి చేరుకుని జీవన్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాగా... తల్లిదండ్రుల అంగీకారంతో జీవన్‌రెడ్డి కళ్లను దానం చేశారు.

క్లుప్తంగా

పారదర్శకంగా పంటల నమోదు


మాట్లాడుతున్న ఏడీఏ రవి

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ సీజన్‌లో సాగు అయిన అన్ని రకాల పంటల వివరాలు పారదర్శకంగా నమోదు చేయాలని అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కృషి భవన్‌లో రూరల్ మండల వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ రవి మాట్లాడుతూ పంట నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పక్కాగా నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి సాగు చేసిన పంటతో పాటు రైతు ఈకేవైసీ తీసుకోవాలన్నారు. ప్రత్యామ్నాయ ప్రణాళికలో భాగంగా 80 శాతం రాయితీతో పెసలు, అలసందలు, ఉలవలు, కొర్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఆర్‌బీకే ద్వారా ఎరువుల అమ్మకాలు పెరగాలన్నారు. సమావేశంలో ఏఓ శశికళ, బోర్డు చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా పథకం కార్మికుల సమ్మె నోటీసు

అనంతపురం అర్బన్: శ్రీ సత్యసాయి నీటి సరఫరా పథకం కార్మికుల సమస్యలు పరిష్కారం చకపోతే సమ్మెలోకి వెళ్తామని నాయకులు ప్రకటించారు. ఈ మేరకు సమ్మె నోటీసును డీఆర్‌ఓ గాయత్రిదేవికి ఆమె చాంబర్‌లో పోరాట కమిటీ నాయకులు ఉపేంద్ర, నాగభూషణం, రామాంజి, తిరుపాల్, గోవిందు, తదితరులు కలిసి శుక్రవారం అందజేశారు. వారు మాట్లాడుతూ కార్మికుల ఎనిమిది డిమాండ్లను పరిష్కరించలేదన్నారు. 14 రోజుల్లోపు వాటిని పరిష్కరించకపోతే సమ్మె బాటపడతామన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


ఆత్మకూరులో సీఎం జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

ఆత్మకూరు: వైఎస్సార్ సున్నా వడ్డీతో మహిళలకు ఆర్థికంగా అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంటోందని ఎంపీపీ సుబ్బరహేమలత తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ సున్నా వడ్డీ నాల్గో విడతలో భాగంగా ప్రజాప్రతినిధులు, మహిళల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 768 సంఘాల్లోని సభ్యులకు రూ.1,05,23,000 అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నీలిమ, ఏపీఎం మధన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

14న ఆర్టీసీ కార్గోలో వేలం

అనంతపురం సెంట్రల్: అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో కార్గో పార్సిల్ విభాగాల్లో ఈనెల 14న వేలం ఉంటుందని ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ నాగభూపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తీసుకెళ్లని వివిధ రకాల వస్తువులను ఉదయం 10.30 గంటలకు అనంతపురం కార్గో కార్యాలయంలో వేలం వేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన పురుషోత్తం నాయక్‌ను చికిత్స కోసం తీసుకెళ్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పురుషోత్తం నాయక్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. రాయదుర్గం తండాకు చెందిన పురుషోత్తం నాయక్ ద్విచక్రవాహనంపై సిలెండర్లు వేసుకొని అనంతపురం వస్తుండగా, వడ్డుపల్లి వద్ద వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో పురుషోత్తం నాయక్ తీవ్రంగా గాయపడగా, హైవే అంబులెన్స్‌లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు.

సర్వే పక్కాగా నిర్వహించండి


బీఎల్‌ఓకు సూచనలిస్తున్న ఆర్డీఓ మధుసూదన్

అనంతపురం అర్బన్: ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలని ఆర్డీఓ, అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి మధుసూదన్ బీఎల్‌ఓలను ఆదేశించారు. శుక్రవారం నియోజకవర్గం పరిధిలోని అరవిందనగర్, పీటీసీ, కోర్టు రోడ్డు ప్రాంతాల్లో బీఎల్‌ఓలు చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతి అంశాన్నీ జాగ్రత్తగా పరిశీలించి, మార్పులు– చేర్పులు చేయాలని ఆదేశించారు.

ప్రతి రైతుకూ నాణ్యమైన విద్యుత్

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: రాప్తాడు నియోజకవర్గంలో ప్రతి రైతుకూ 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం కొడిమి జగనన్న కాలనీ పక్కన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూన్నెళ్లలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు. 11 కేవీ, 33 కేవీ విద్యుత్‌లైన్లు అనుసంధానం చేయడం వల్ల కొడిమి, రాచానపల్లి, నరసనాయనికుంట, నాగిరెడ్డిపల్లి, నారాయణపురం గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. కొడిమి జగనన్న కాలనీలో నిర్మాణమయ్యే 6,500 ఇళ్లకు విద్యుత్ అందించేందుకు సబ్‌స్టేషన్ చాలా ఉపయోగపడుతుందన్నారు. నియోజకవర్గంలో ఉప్పరపల్లి, కుంటిమద్ది, మేడాపురంలోనూ సబ్‌స్టేషన్లు నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. తోపుదుర్తి, గొరిదిండ్ల గ్రామాల్లో సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే అనుమతులు వస్తాయన్నారు. నియోజకవర్గంలో 20,351 మంది రైతులకు హెచ్‌ఓడీఎస్ కింద అగ్రికల్చర్ సర్వీస్‌లు ఇచ్చామన్నారు. ఇందులో భాగంగా ప్రతి రైతుకూ ఒక ట్రాన్స్‌ఫార్మర్ అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి పథకాలు, పంచాయతీలకు, ప్రజల అవసరాలకు పూర్తిస్థాయిలో విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్‌యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మీ, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, సర్పంచ్ సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ వెంకటలక్ష్మీ, పీఏసీఎస్ చైర్మన్ గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపాల్‌రెడ్డి, రామాంజనేయులరెడ్డి, మాజీ సర్పంచ్ ఆది నారాయణ, నరసనాయనికుంట శ్రీనివాసులు, అశ్వర్థ, ఆనంద్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

జలధిపూజకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల రాచెర్లప్ప స్వామి జలధి పూజ ఈనెల 20న నిర్వహించనున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి గ్రామస్తులు, గుడిపెద్దలు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందించారు. గణపతి పూజ, రుద్రాభిషేకం తర్వాత జలధి పూజ ఉంటుందని గుడిపెద్దలు తెలిపారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, గుడి పెద్దలు చిట్రా గంగాధర్, చిట్రా బయన్న, చిట్రా దుర్గన్న, చిట్రా రామమూర్తి, చిట్రా వెంకటరాముడు, చిట్రా నాగభూషణం, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

సాయుధ బలగాల సాధన


సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 15న నిర్వహించనున్న పంద్రాగస్టు వేడుకలకు స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో సాయుధ పోలీసు బలగాలు సాధన చేశాయి. సాయుధ బలగాల సాధనను పర్యవేక్షించిన ఎస్పీ.. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. పంద్రాగస్టు వేడుకలు జాతీయ సమైక్యత, దేశభక్తి వెల్లువిరిసేలా పరేడ్ మైదానం ముస్తాబు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎ. హనుమంతు, ఆర్‌ఐలు హరి కృష్ణ, శివరాముడు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


సాయుధ బలగాల సాధన,

సంకల్పంతో సాధన చేస్తే విజయం తథ్యం


అభ్యర్థులకు సూచనలు, సలహాలు ఇస్తున్న జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పరేడ్ మైదానంలో ఉచితంగా ఈవెంట్స్ శిక్షణలో పాల్గొన్న ఎస్‌ఐ, కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులతో ఎస్పీ కె. శ్రీనివాసరావు ముఖాముఖి నిర్వహించారు. ఉద్యోగం తప్పకుండా సాధిస్తామనే దృఢ సంకల్పంతో సాధన చేస్తే విజయం తథ్యమని ఎస్పీ అన్నారు. ఎస్‌ఐ, కానిస్టేబుల్ ప్రిలిమ్స్ అర్హత అభ్యర్థులకు జిల్లా పోలీసుశాఖ ఉచితంగా పోలీసు సిబ్బందితో ఈవెంట్స్‌కు ప్రాక్టీస్ చేయిస్తున్నారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులతో మాట్లాడారు. లక్ష్యం ఎలా చేరాలి, కఠోర శ్రమ, సానుకూల దృక్పథంతో ముందుకెళ్లి ఎలా ఉద్యోగం సాధించాలో దిశానిర్దేశం చేశారు. త్వరలో జరగనున్న ఈవెంట్స్‌లో ఎలా సక్సెస్ కావచ్చో పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీతో పాటు ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు 'అమ్మ' సంస్థ చేయూత


ఆర్థిక సాయం అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నగర శివారులోని లెనిన్ నగర్‌కు చెందిన నాగార్జున, మంజుల దంపతులు బేల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఇద్దరూ మరణించారు. దాంతో పదేళ్లలోపు వయసున్న ముగ్గురు ఆడపిల్లలు విష్ణుప్రియ, హరిప్రియ, మధుప్రియ అనాథలుగా మిగిలిపోయారు. ఆపన్నహస్తం కోసం ఎదురుచూశారు. స్పందించిన అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి శుక్రవారం చిన్నారుల వద్దకు వెళ్లి రూ.25 వేలు నగదు, మరో రూ.15 వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులు, రూ.13 వేలతో వస్త్రాలు అందించారు. చిన్నారుల చదువుల కోసం భరోసా ఇచ్చారు.

డీఈఓ ఆఫీస్‌లో ముగిసిన ఆడిట్

రాప్తాడురూరల్: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న ఇంటర్నల్ ఆడిట్ శుక్రవారం ముగిసింది. రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలోని ఆడిట్ విభాగం ఏఓ రామశేషకుమార్, సీఏఓ బాల వీరయ్య డీఈఓ కార్యాలయంలోని అన్ని విభాగాల ఫైనాన్స్‌కు సంబంధించి ఆడిట్ చేశారు. ఆడిట్ సీఈఓ వెంకటసుబ్బమ్మ శుక్రవారం జిల్లాకు వచ్చారు. ఆమెకు డీఈఓ ఎం.సాయిరామ్ పూలబొకే అందజేసి, స్వాగతం పలికారు. సీఈఓ ఫైనాన్స్‌కు సంబంధించిన అన్ని రికార్డులనూ పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, ఏడీలు నాగరాజు, కృష్ణయ్య, సూపరింటెండెట్లు శ్రీనాథ్, ఆదినారాయణ, డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తం బాబు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలో నగరాభివృద్ధి ఏదీ?


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: టీడీపీ హయాంలో ఐదేళ్లలో మాటలకే పరిమితమయ్యారుగానీ నగరంలో చేసిన అభివృద్ధి ఏదీ? అని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని ఉద్దేశించి మేయర్ వసీం అన్నారు. శుక్రవారం 38వ డివిజన్ కోవూర్‌నగర్‌లో రూ.21 లక్షలతో వేస్తున్న బీటీ రోడ్డు (270 మీటర్లు) పనులను మేయర్ పరిశీలించారు. అనంతరం మేయర్ ఇటీవల టీడీపీ నాయకులు చేసిన చౌకబారు మాటలపై మండిపడ్డారు. గత టీడీపీ ప్రభుత్వంలో వర్గపోరుతో అభివృద్ధి శిలాఫలకాలు, కాగితాలకే పరిమితమైందన్నారు.తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నగరంలో రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారం, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నగరంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ప్రతి డివిజన్‌లో రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు పనులు జరిగాయన్నారు. 38 డివిజన్‌లో రూ.కోటిన్నర పనులు జరిగాయని, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి నివాసం ఉండే ప్రాంతం, చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షం వస్తే ప్రజలు అవస్థలు పడేవారన్నారు. శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.90 లక్షలతో పనులు చేస్తున్నామన్నారు.

దౌర్జన్యాలకు కేరాఫ్ టీడీపీ:
ఇటీవల 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్ర, తదితరులు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులపై దాడికి పాల్పడ్డారని, అందుకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రోత్సహిస్తున్నారంటూ టీడీపీ నాయకులు షో చేస్తున్నారని మేయర్ మండిపడ్డారు. సెబ్ పీఎస్‌లో ఎవరిపై ఎవరు దాడి చేశారో వీడియోలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అభివృద్ధి చేయాలని ప్రశ్నించిన వారి కార్పొరేటర్‌నే మరో కార్పొరేటర్ దాడి చేయడం , నలుగురు కమిషనర్లపై నోరుజారడంతో పాటు దాడికి యత్నించడం, పింఛన్ కోసం అభ్యర్థించినదివ్యాంగుడిపై చేయి చేసుకోవడం, ప్రస్తుత డిప్యూటీ మేయర్‌గా ఉన్న కోగటం విజయభాస్కర్ రెడ్డిపై ఉద్దేశపూర్వకంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించడం ఇలా ఎన్నో దారుణాలను ప్రజలు మర్చిపోలేదన్నారు. కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు ఖాజా, చింతకుంట మధు, తదితరులు పాల్గొన్నారు.

చియ్యేడులో రాబియాబీ శిలాఫలకం ఆవిష్కరణ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడుకు చెందిన మహిళా స్వాతంత్య్ర సమరయోధురాలు సయ్యద్ ముల్లా రాబియాబీ శిలాఫలకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన 'నా భూమి నా దేశం'లో భాగంగా శిలాఫలకాన్ని వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ పుల్లయ్య ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధురాలు సయ్యద్ ముల్లా రాబియాబీ చియ్యేడువాసి కావడం ఎంతో గర్వకారణమన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు.మండల అగ్రి అడ్వయిజర్ కమిటీ రవీంద్రారెడ్డి , సర్పంచ్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధురాలు రాబియాబీని గుర్తు చేసుకోవడం మన బాధ్యత అన్నారు. టీచరు నాగేంద్ర, గ్రామస్తు లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రయాణికుడికి ల్యాప్‌టాప్ అందజేత

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకుపోయిన ల్యాప్‌టాప్‌ను అనంతపురం డిపో మేనేజర్ మూర్తి ప్రయాణికుడికి అందించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీహరి ఓ ప్రైవేట్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. హైదరాబాద్‌కు నుంచి ధర్మవరానికి వస్తుండగా గుత్తి బస్టాండ్‌లో కిందకు దిగాడు. ఆ సమయంలో బస్సు వెళ్లిపోయింది. దీంతో బాధితుడు రూ. లక్ష విలువజేసే ల్యాప్‌టాప్ బస్సులోనే ఉండిపోయిందని గుత్తి ఆర్టీసీ సిబ్బందికి తెలియజేశాడు. సదరు అధికారులు అనంతపురం స్టేషన్ మేనేజర్ మూర్తికి తెలియజేయడంతో ల్యాప్‌టాప్ బ్యాగును స్వాధీనం చేసుకున్నారు.

బీబీ ఫాతిమా చివరి దర్శనం


బీబీ ఫాతిమాను దర్శించుకుంటున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: ఐదో రోడ్డు బీబీ ఫాతిమా పీర్ల జాతరలో భాగంగా శుక్రవారం చివరి దర్శనం సందడిగా జరిగింది. ఉదయం పీర్లకు ప్రత్యేక పుష్పాలంకారణ చేసి, పూజలు నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని చక్కెర చదివింపులు చేశారు.

ఆస్పత్రి ఆవరణలో జీవచ్ఛవంలా..



అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి దయనీయ స్థితిలో పడి ఉన్నాడు. కొన్ని రోజులుగా ఆస్పత్రిలో ఉన్న షెడ్డు సమీపంలో కటిక నేలపై జీవచ్ఛవంలా పడి ఉంటున్నాడు. అతను ఎక్కడి నుంచి వచ్చాడో వివరాలు తెలియదు. సర్వజనాస్పత్రిలో తిష్టవేసే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు ఈ అభాగ్యుడి దయనీయ పరిస్థితి కనిపించకపోవడం గమనార్హం.

సంక్షిప్త సమాచారం

ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోండి

చెన్నేకొత్తపల్లి: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంట వివరాలను తప్పనిసరిగా ఈ క్రాప్‌బుకింగ్ చేయించుకోవాలని ఏఓ ఉదయ్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్నారన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం సెల్‌ఫోన్ తీసుకెళ్లాలన్నారు.

ఈకేవైసీ ప్రక్రియ వేగవంతం చేద్దాం


మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యం

అనంతపురం రూరల్: ఈకేవైసీ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాల్సిన బాధ్యత అన్ని కార్పొరేషన్ల అధికారులపై ఉందని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో ఎస్సీ, , ఎస్టీ, బీసీ కార్పొరేషన్ అధికారులతో బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపునేస్తం, జగనన్న చేదోడు, ఈబీసీ నేస్తం, వాహన మిత్ర, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి తదితర పథకాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. అయితే ఈకేవైసీ పూర్తి కాకపోవడంతో అర్హుల ఖాతాలోకి నగదు జమ కావడం ఆలస్యమవుతుందన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కనగానపల్లి: గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమావేశంలో చదివి వినించారు. ఇక వివిధ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులకు ఫిర్యాదు చేశారు.

ప్రొఫెసర్ చిట్టా సురేష్‌కు మెమో

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ చిట్టా సురేష్‌కు ఇటీవల మెమో జారీచేశారు. బయోకెమిస్ట్రీ విభాగంలో ప్యానల్ బోర్డులు బిగించే సమయంలో విభాగాధిపతి చిట్టా సురేష్ రెండు రోజులు అందుబాటులో లేరు. దీంతో ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని మెమో జారీ చేశారు.

సర్టిఫికెట్లు సకాలంలో అందించండి


అనంతపురం క్రైం: జనన, మరణ సర్టిఫికెట్లు సకాలంలో అందించాలని సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పనత్రిలోని మెడికల్ రికార్డు సెక్షన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజూ ఎంత మందికి పత్రాలు మంజూరు చేస్తున్నారని ఆరా తీశారు. గైనిక్ విభాగంలో పేర్లు నమోదు చేయడంలోనే తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయని మెడికల్ రికార్డు సెక్షన్ సిబ్బంది సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం రోగుల సహాయకులకు గేట్ పాస్ అందించే కార్యక్రమానికి సూపరింటెండెంట్ శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణనిలో ఉన్న రోగులకు వేడి నీరు అందించే గదిని సూపరింటెండెంట్ పరిశీలించారు. ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, నర్సింగ్ సూపరింటెండెంట్లు మంజు, రజిని, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేపై నేడు గ్రామసభలు

రాప్తాడురూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష' పేరుతో చేపడుతున్న రీసర్వేపై శనివారం అనంతపురం రూరల్ మండలం జంగాలపల్లి, కందుకూరు, కురుగుంట గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు కందుకూరు, జంగాలపల్లి గ్రామాల్లో, మధ్యాహ్నం 12 గంటలకు కురుగుంట గ్రామంలో గ్రామసభలు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీధరమూర్తి తెలిపారు. రీసర్వేపై ఎలాంటి అపోహలు లేకుండా రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

కరువుపై కవుల అక్షర సమరం

- రేపు 'అనంత కరువు – ఇనుపగజ్జెల తల్లి' పుస్తకావిష్కరణ



అనంతపురం కల్చరల్: అనంతలో దశాబ్దాల తరబడి కరువు రక్కసి రాజ్యమేలింది. సకాలంలో వర్షాలు రాక, పంటలు పండక, పండినా గిట్టుబాటు ధర లేక అల్లాడిపోయిన రైతాంగం..అనేక సందర్భాల్లో వలస బాటలు పట్టింది. అలాంటి కరువు నేలలో వందలాదిగా రైతులు ఆత్మహత్యలూ చేసుకున్నారు. సాహితీవేత్తలు, కవులు, రచయితలు, కళాకారులు కరువు కథాంశంగా సాహిత్యాన్ని, కళారూపాలను సృజియించారు. కమ్యూనిస్టు నాయకులు కరువు యాత్రలు నిర్వహించారు. 2004లో అలా పుట్టుకొచ్చిన కథలనే జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 'అనంత కరువు – ఇనుపగజ్జెల తల్లి' పేరిట కథా సంకలనం తెచ్చారు. దానిపై పరిశోధన సాగించి, 2010లో ఎంఫిల్ పట్టా పొందిన పి.ఉమాదేవి దురదృష్టవశాత్తూ కొన్నేళ్లకే మరణించగా, దాదాపు 13 ఏళ్ల తర్వాత ఆ పుస్తకాన్ని ఆమె భర్త చెట్లఈరన్న విశాలాంధ్ర పుస్తక ప్రచురణ ద్వారా వెలుగులోకి తెచ్చారు.

పుస్తకం చెప్పే కథలెన్నో :
నాడు కరువు కరాళనృత్యం చేసింది. వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత నెమ్మదించిన కరువు రక్కసి..వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే దాదాపు కరువు ఛాయలు తగ్గుతూ వచ్చాయి. కానీ ఈ తరం వారికి నాడు భయంకరంగా రైతాంగాన్ని కబళించిన కరువుపై ఈ కథలు ఎంతోహృద్యంగా చెప్తాయి. అనంతకు చెందిన సీనియర్ రచయితలు దివంగత, చిలుకూరి దేవపుత్ర, సింగమనేని నారాయణతోపాటు డాక్టర్ శాంతినారాయణ, బండి నారాయణస్వామి, సడ్లపల్లి చిదంబర రెడ్డి, జి.బాషా, వివేకానంద, జూటూరు షరీఫ్, రాఘవేంద్ర రావు, హిదయతుల్లా, వెంకటకృష్ణ, ఎస్వీ ప్రసాద్, జయలక్ష్మిరాజ్, షెహనాజ్, చిలుకూరి దీవెనతో పాటు ఇక్కడి కరువును చూసి చలించిన వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన రామకృష్ణ, గుంటూరు జిల్లాకు చెందిన నల్లూరి రుక్మిణి ఇనుప గజ్జెల తల్లి పుస్తకంలో అద్భుతమైన కథలు రచించారు. ఈ నేపథ్యంలో వస్తున్న పుస్తకావిష్కరణను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

కరువు కథలపై అందరూ తెలుసుకోవాలి
నా దగ్గర చదువుకున్న చివరి పరిశోధక విద్యార్థిని పి.ఉమాదేవి. ఆ నాటి పరిస్థితులు కళ్లకు కట్టినట్లు చెప్పే 'అనంత కరువు – ఇనుప గజ్జెల తల్లి' పుస్తకం అందరూ చదవదగింది. అందుకే అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎన్జీవో హోంలో పుస్తకావిష్కరణ జరుగుతోంది. అనంత సాహిత్య విలువలకు అద్దంపట్టే చక్కటి పుస్తకాన్ని ఎందరో మహనీయులు సంకలనం చేశారు.
– ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, అరసం రాష్ట్ర అధ్యక్షుడు